సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



వీడని హత్య మిస్టరీ..?
వలస కూలీ హత్య కేసు మిస్టరీగా మారింది. హత్యాస్థలంగా భావిస్తున్న ప్రాంతంలో పోలీసులు తవ్వకాలు జరిపినా మృతదేహం లభ్యం కాకపోవడంతో దర్యాప్తు కొనసాగుతోంది. 8లో ▸



ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0/24.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జిల్లాకు హైకోర్టు జడ్జి



సుజనకు మొక్క ఇస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి శుక్రవారం రాత్రి తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ కే సుజన వచ్చారు. జిల్లా కేంద్రంలోని పెన్ గంగా భవన్‌లో ఆమెకు జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ స్వాగతం పలికారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న డిస్ట్రిక్ట్ జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో హైకోర్టు జడ్జి పాల్గొననున్నారు.

ఘనంగా ఓనం ఉత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయంలో శుక్రవారం ఓనం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరయ్యారు. ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, మహేశ్, ఆలయ కమిటీ సభ్యులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా వీరు ఆలయంలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఓనం విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజీ సూర్యకాంత్, దాముక రవీందర్, మహేశ్, అన్నోజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి కలెక్టర్, ఎస్పీ పూజలు



గణపతికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామన్స్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకునికి శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య కూడా గణేశుడిని దర్శించుకుని పూజలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గంట వినోద్, ప్రతినిధులు దత్తాత్రి, రవి, సారంగపాణి, విఠల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అలేఖ్య

ఆదిలాబాద్: బాలకేంద్రంలో నృత్య శిక్షణ పొందుతున్న చిన్నారి కొండ్ర అలేఖ్య రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు కేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి ఓ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల–2లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో భామాకలాపంపై నర్తించి మొదటి స్థానంలో నిలిచిన హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బాలకేంద్రం తల్లిదండ్రుల సంఘం ప్రతినిధులు అలేఖ్యను అభినందించారు.

బియ్యం సరే.. సంచి ఏది?



పట్టణంలో బియ్యం తీసుకుంటున్న మహిళ

కైలాస్‌నగర్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. మూడు నెలల తర్వాత ఈ నెల కోటా పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం లబ్ధిదారుకు బియ్యంతోపాటు సంచి ఇవ్వాలని నిర్ణయించింది. సరిపడా సంచులు జిల్లాకు సరఫరా చేసింది. అయితే సన్నబియ్యం పంపిణీ ప్రారంభమై ఐదురోజులైనా ఎక్కడా సంచులు పంపిణీ చేయలేదు. లబ్ధిదారులు ఇంటి నుంచి తెచ్చుకున్న సంచుల్లోనే బియ్యం తీసుకెళ్తున్నారు. కొన్నిచోట్ల సంచి కోసం డీలర్లను ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీని సంప్రదించగా సంచుల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు.

పీడీపీఎస్ అమలయ్యేనా?

- ఇప్పటివరకు జారీ కాని గైడ్‌లైన్స్
- అమలైతే రైతులకు ప్రయోజనమే..
- జిన్నింగ్ వ్యాపారుల నిరాసక్తత
- పాత విధానమేనన్న అధికారులు!



ఆదిలాబాద్ మార్కెట్‌కు పత్తితో వచ్చిన వాహనాలు (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో ధర వ్యత్యాస చెల్లింపు పథకం (పీడీపీఎస్) అమలు ప్రశ్నార్థకంగా మారింది. ఆదిలాబాద్ మార్కెట్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా ఈ సీజన్ నుంచే అమలు చేయనున్నట్లు స్వయంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గతంలో ప్రకటించారు. అయితే.. ఇప్పటివరకు దీనిపై ఎలాంటి విధివిధానాలు ఖరారు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఉత్తర్వులూ రాలేదు. దీంతో ఈ పథకం అమలవుతుందో.. లేదో.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం అమలు చేస్తే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయోననే సందిగ్ధం రైతులు, వ్యాపారులు, మార్కెటింగ్ అధికారుల్లో నెలకొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అమలు చేసేందుకు సిద్ధంగా లేమని కేంద్రానికి స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో పీడీపీఎస్ అమలు ప్రశ్నార్థకం కాగా, ఎక్కడ అమలవుతుందోనని ఆందోళన చెందుతున్న ఆయా వర్గాలకు ఊరట లభించనట్లయింది.

ఇదీ.. పథకం ఉద్దేశం

ధర వ్యత్యాస చెల్లింపు పథకం (పీడీపీఎస్)ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం ప్రకారం భారత పత్తి సంస్థ (సీసీఐ) మార్కెట్‌లో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయదు. వ్యాపారులు మాత్రమే రైతుల పత్తి కొనుగోలు చేస్తారు. ప్రధానంగా మార్కెట్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కంటే రైతులకు తక్కువ ధర లభించిన పక్షంలో ఆ వ్యత్యాసాన్ని కేంద్రం భరిస్తుంది. సీసీఐ ద్వారా ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. మార్కెట్‌లో ఎంఎస్పీ కంటే తక్కువ ధర ఉన్నప్పుడు రైతులకు ఆ వ్యత్యాసాన్ని చెల్లించడం ద్వారా వారికి నష్టం కలగకుండా చూడాలన్నదే ప్రభుత్వ భావన. కానీ.. జిల్లాలో అమలయ్యే పరిస్థితి కనిపించడంలేదు.

కేంద్రంతో పలుసార్లు చర్చలు

ఈ విధానంపై గత సీజన్ చివరలోనే చర్చ మొదలైంది. అదే సమయంలో జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఆదిలాబాద్ మార్కెట్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తారనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత మళ్లీ పలుసార్లు కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని చర్చలకు పిలిచింది. గత జూన్ 19న న్యూఢిల్లీలోని నీతి ఆయోగ్ భవన్‌లో ఈ విషయంపై సమావేశం నిర్వహించారు. పీడీపీఎస్ అమలులో ఎదురయ్యే ఇబ్బందులు, సవాళ్లపై చర్చించారు. నీతి ఆయోగ్, సీసీఐ ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అధికారులు, కాటన్ అసోసియేషన్ సభ్యులు, ఎంపిక చేసిన రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా నుంచి ఓ జిన్నింగ్ మిల్లు వ్యాపారి, రైతు సంఘం నాయకుడు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఈ విధానం సాధ్యం కాదు



పీడీపీఎస్ విధానంలో వ్యాపారులే పత్తి కొనుగోలు చేయాలి. రూల్స్ ప్రకారం ఆదిలాబాద్ మార్కెట్‌కు పెద్దమొత్తంలో వచ్చే మొత్తం పత్తిని వ్యాపారులే కొనుగోలు చేయాలంటే సాధ్యం కాదు. రైతులు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించాలని అడుగుతారు. మార్కెట్‌లో అమ్మిన తర్వాత ధర వ్యత్యాసాన్ని పరిశీలించి ప్రభుత్వం ఆ నష్టాన్ని చెల్లిస్తుంది. అప్పటివరకు రైతులు ఆగే పరిస్థితి ఉండదు.

– రాజు చింతవార్, జిన్నింగ్ వ్యాపారి

పాత పద్ధతిలోనే కొనుగోళ్లు



పీడీపీఎస్ విధానంపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వానికి పలుసార్లు చర్చలు జరిగాయి. అయితే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ విధానం అమలుపై ఎలాంటి స్పష్టత లేదు. గతంలో లాగే.. పాత పద్ధతిలో క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తాం.

– గజానన్, మార్కెటింగ్ శాఖ అధికారి, ఆదిలాబాద్

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న టీచర్లు



సీఎం చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సూరజ్ సింగ్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లాకు చెందిన గురువులు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సూరజ్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం స్వీకరించారు. అనంతరం సీఎంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆదిలాబాద్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల–బోథ్ ప్రిన్సిపల్ డాక్టర్ శివకృష్ణ కూడా ఉత్తమ ప్రిన్సిపల్‌గా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణి, డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాల అధ్యాపకుల సమష్టి కృషి, అంకితభావంతోనే పురస్కారాలు వచ్చినట్లు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న శివకృష్ణ

ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తాం

- ఎంపీ గోడం నగేశ్
- ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

కైలాస్‌నగర్: ఆదివాసీల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం పీఎం జన్‌మన్ పథకం కింద ఆదిలాబాద్ రూరల్ మండలంలోని 359 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఏ ఒక్క ఆదివాసీ పక్కా ఇల్లు లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం పీఎం జన్‌మన్ కింద ఇళ్లు మంజూరు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేల మండల కేంద్రంలో..


బేల: మండలకేంద్రంలోని గణేశ్ గార్డెన్స్‌లో పీఎం జన్‌మన్ పథకం కింద బేల, సాత్నాల మండలాలకు చెందిన 1,008మంది పీవీటీజీ ఆదివాసీ లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ బసవేశ్వరయ్య, జైనథ్ ఏఎంసీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ సవాపురే విలాస్, ఎంపీడీవోలు మహేందర్‌కుమార్, వెంకట్‌రాజు, తహసీల్దార్ రఘునాథ్‌రావు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కైలాస్‌నగర్: మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీ నగేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే శంకర్

పేదల సంక్షేమమే ధ్యేయం

ఇంద్రవెల్లి: పేదల సంక్షేమమే మోదీ ప్రభుత్వ ధ్యేయమని, తాజాగా జీఎస్టీ తగ్గింపు నిర్ణయం పేద, మధ్య తరగతి కుటుంబాలకు నేరుగా లాభం జరుగుతుందని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని హర్షిస్తూ మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో పన్నుల భారంతో సామాన్యులు చాలా ఇబ్బందులకు గురయ్యారని ఆరోపించారు. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ తగ్గింపు అమలులోకి రానుండగా ఇది దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలకు పేదలకు మోదీ ప్రభుత్వం ఇచ్చిన బహుమానమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్, నాయకులు కేంద్రే బాలాజీ, ఆరెల్లి రాజలింగు, ఆర్క ఖమ్ము, శివకుమార్ జైస్వాల్, తుకారాం, హనుమంత్‌రావ్, రాజేశ్వర్, రాజువర్ధన్, దిలీప్, రాధిక, జైరాం తదితరులున్నారు.



ఆదిలాబాద్: పెన్‌గంగ వంతెనపై నిమజ్జనానికి తరలివచ్చిన గణపతులు

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. గురువారం మొదలైన నిమజ్జనోత్సవం శుక్రవారం ఉదయం వరకు కొనసాగింది. పెన్‌గంగ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం, భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని సూర్య గణేశ్, శివాజీ మార్కెట్, శ్రీహనుమాన్, పోచమ్మ, మైసమ్మ, రామ్‌సేన్, గాంధీనగర్ యూత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండళ్ల వద్ద శుక్రవారం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. యువకులు బ్యాండ్ మేళా, భాజాభజంత్రీల మధ్య నృత్యాలు చేస్తూ శోభాయాత్రగా వెళ్లారు. అనంతరం గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని గొండ్‌గూడ, పర్ధాన్‌గూడ, మిలింద్‌నగర్, ముత్నూర్ గ్రామాల్లో శుక్రవారం రాత్రి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయా మండళ్ల వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సంప్రదాయ వాయిద్యాలతో గణేశ్ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు.



బజార్‌హత్నూర్: నృత్యం చేస్తున్న మహిళలు



ఇంద్రవెల్లి: బ్యాండ్ వాయిస్తున్న యువకులు

సర్వం సిద్ధం

- నేడు గణపతి నిమజ్జనోత్సవం
- జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి
- పకడ్బందీగా పోలీస్ బందోబస్తు



శోభాయాత్ర ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న హిందూ సమాజ్ ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్: వినాయక చవితి నుంచి భక్తుల విశేష పూజలందుకున్న గణేశుడు గంగమ్మ ఒడికి చేరేవేళ ఆసన్నమైంది. శనివారం నిర్వహించనున్న నిమజ్జనోత్సవానికి మున్సిపల్, పోలీస్ శాఖలు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల విగ్రహాలు ప్రతిష్ఠించగా ఇప్పటికే 3, 5, 7, 9 రోజుల్లో 1,550 ప్రతిమలను నిమజ్జనం చేశారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా 450 గణపతి విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి.

శిశుమందిర్ నుంచి శోభాయాత్ర..

జిల్లా కేంద్రంలోని వినాయక చౌక్‌లో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద ఉదయం 10గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు శోభాయాత్రను లాంఛనంగా ప్రారంభిస్తారు. దశాబ్దాలుగా ఇక్కడ ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. భక్తులు భక్తి గీతాలు, భజన కీర్తనలు, సాంస్కృతిక నృత్యాల మధ్య ఇక్కడి నుంచే శోభాయాత్ర ప్రారంభమవుతుంది.

పోలీస్‌శాఖ నిరంతర నిఘా

వేడుకలు శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలో 600 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 350 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించనున్నారు. ఎనిమిది క్లస్టర్లు, ఎనిమిది సెక్టార్లుగా విభజించి సిబ్బందికి విధులు కేటాయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 23 పికెట్స్ ఏర్పాటు చేసి అధికారులతో పాటు స్ట్రైకింగ్ ఫోర్సు, 15మంది సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. ప్రధాన రోడ్లలో రూఫ్ టాప్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 15 మంది కెమెరా సిబ్బందిని నియమించనున్నారు. మొత్తంగా జిల్లా కేంద్రంలో 15 మంది సీఐలు, నలుగురు డీఎస్పీలు, ఇద్దరు ఏఎస్పీలు ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రం సమీపంలోని చాందా టీ వాగు, పెన్ గంగా వద్ద మహిళా సిబ్బందిని నియమించారు. ఇదే విషయమై తన కార్యాలయంలో ఎస్పీ శుక్రవారం డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు తదితరులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

శోభాయాత్ర ఇలా..

పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా శోభాయాత్ర సాగుతుంది. వినాయక్ చౌక్ నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర ఓల్డ్ బస్టాండ్, అశోక్‌రోడ్, దేవిచంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీచౌక్, ఠాకూర్ హోటల్ మీదుగా సాగనుంది. పాత జాతీయ రహదారిపై నుంచి చాందా వంతెనతో పాటు, అది దాటి నేషనల్ హైవే–44 మీదుగా పెన్ గంగాకు చేరుకోనుంది. ఈ మేరకు ఈ రూట్‌లో ఇప్పటికే ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా పూర్తయింది. ఇటీవల కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ రూట్ మ్యాప్ పరిశీలించారు.



పట్టణంలో నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్

సమస్యలు సృష్టిస్తే చర్యలు



జిల్లా కేంద్రంలో నిమజ్జనోత్సవ శోభాయాత్రకు సంబంధించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. చివరి విగ్రహం నిమజ్జనం పూర్తయ్యేదాకా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తుంది. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. సమస్యలు సృష్టించే వారిని వీడియోగ్రఫీ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటాం. డ్రోన్ కెమెరాలతో పట్టణంలోని పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించే ఆకతాయిలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో..

పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇదివరకే రహదారుల మరమ్మతు పనులు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి కల్పించనున్నారు. తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నారు. గణపతి విగ్రహాల నిమజ్జనం జరిగే చాందా టీ, పెన్ గంగా వద్ద క్రేన్లు ఏర్పాటు చేశారు. లైటింగ్ సిస్టం ఏర్పాటు సిద్ధం చేశారు. ఈ రెండు చోట్ల గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు.

దుష్ప్రచారం చేసినవారిపై చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: రెండు గ్రూపుల మధ్య గొడవ సద్దుమణిగేలా చేసిన పోలీస్ అధికారులపై దుష్ప్రచారం చేసినవారిపై చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం శివాజీ చౌక్ నుంచి ఠాగూర్ హోటల్‌కు వెళ్లే దారిలో ఒకే వినాయక మండపానికి చెందిన వ్యక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి మద్యం మత్తులో గొడవ పడ్డారని తెలిపారు. ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ అధికారి, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్, సెక్టార్ అధికారి నాగనాథ్ గొడవ సద్దుమణిగేలా చేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ వినకపోవడంతో వారిని చెదరగొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కొందరు వ్యక్తులను పోలీసులు కొట్టారని అసత్య ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం అహర్నిషలు విధులు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.

'గిరి' గ్రామాల్లో బీటీ రోడ్లకు రూ.13.12 కోట్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.13.12 కోట్ల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం శివఘాట్ నుంచి కుంబఝరి మీదుగా టాక్లీ వరకు రూ.2.38 కోట్లతో మూడు కిలో మీటర్లు, అల్లికోరి ఎక్స్‌రోడ్డు నుంచి అల్లికోరి గ్రామం మీదుగా పొట్టంలొద్ది వరకు రూ.2.87 కోట్లతో మూడు కిలోమీటర్లు, ఖండాల ఎక్స్‌రోడ్డు నుంచి చిచ్‌ధరి ఖానాపూర్ వరకు రూ.75 లక్షలతో 0.20 కిలోమీటర్లు, చించుఘాట్ నుంచి చిన్న పెందూర్ లొద్ది మీదుగా తోషం వరకు రూ.5.10 కోట్లతో 6.70 కిలోమీటర్లు, లోహారా నుంచి హరిజనగూడ, సలాయిగూడ, చింతగూడ, శివగూడ మీదుగా తిప్ప ఎక్స్‌రోడ్డు వరకు రూ.85 లక్షలతో 0.50 కిలో మీటర్ల బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అంకోలి ఎక్స్‌రోడ్డు నుంచి దండారి గూడ స్పాన్ బ్రిడ్జి చెక్ డ్యాం మిగులు పనులు రూ.17లక్షలతో చేపట్టనున్నట్లు తెలిపారు. బేల మండలం సాంగ్వి నుంచి పాటగూడ వరకు రూ.కోటితో కిలోమీటర్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

గడువు తీరిన మందుల విక్రేతపై చర్య తీసుకోవాలి



కాలం చెల్లిన టాబ్లెట్ బాటిల్

ఆదిలాబాద్‌టౌన్: గడువు తీరిన మందులు విక్రయించిన మెడికల్ షాపు నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన సయ్యద్ సాబీర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ సాబీర్ పట్టణంలోని కలెక్టరేట్ చౌక్‌లో గల 'న్యూ ఏ టూ జెడ్' ఫార్మసీలో గురువారం ఎల్ట్రోక్సిన్ టాబ్లెట్ బాటిల్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి బాటిల్‌ను పరిశీలించగా గత జనవరిలోనే గడువు ముగిసినట్లు గుర్తించాడు. దీనిని సదరు మెడికల్ షాపు యజమాని దృష్టికి తీసుకువెళ్లగా, అతడు దానిని లాక్కునే ప్రయత్నం చేసి వాగ్వాదానికి దిగినట్లు బాధితుడు ఆరోపించాడు. కాలం చెల్లిన మందులు విక్రయించడంతోపాటు తనతో అమర్యాదగా ప్రవర్తించిన మెడికల్ షాపు నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని సయ్యద్ సాబీర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మెడికల్ షాప్ సీజ్ చేయాలని కోరాడు.

క్లుప్తంగా

హెచ్‌ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా సుదర్శన్



వెల్డి సుదర్శన్

మందమర్రిరూరల్: హెచ్‌ఎంఎస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా మందమర్రికి చెందిన వెల్డి సుదర్శన్‌ను నియమిస్తున్నట్లు ఆ యూనియన్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ ప్రకటించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ సింగరేణిలో హెచ్‌ఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. సంస్థ గత సంవత్సరం వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించాలని, ఉద్యోగులకు 40శాతం వాటా చెల్లించాలని పేర్కొన్నారు.

నాలుగు డీజేలు సీజ్

నేరడిగొండ: సుప్రీం కోర్టు నిబంధనలకు లోబడి సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయాలని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ బండారి రాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో గణపతి మండపాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన నాలుగు డీజేలు సీజ్ చేసినట్లు తెలిపారు. డీజే యజమానులతో పాటు ఆపరేటర్లపై నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గణపతి మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది ఉన్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన బాలిక

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం వీధి కుక్కలు దాడి చేసి చిన్నారికి తీవ్రంగా గాయపర్చాయి. ఒకటో తరగతి విద్యార్థిని అక్షిత తన తల్లితో కలిసి అక్కడికి వెళ్లింది. ఒక్కసారిగా కుక్కల మంద దాడి చేయడంతో బాలిక కిందపడిపోయింది. తల, శరీరంపై తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు కుక్కలను తరిమి చిన్నారిని కాపాడారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు. కుక్కలు స్వైరవిహారం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఇరు వర్గాలపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా పరస్పరం దాడి చేసుకున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన బీమనవేణి శ్రీకాంత్, మహేందర్, వరప్రసాద్, శివ శుక్రవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా టపాకాయలు కాలుస్తున్నారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన బాలాజీ నిప్పంటించిన ఓ టపాకాయను చేతుల్లోకి తీసుకున్నాడు. దీంతో అది పేలి అతడికి గాయమైంది. అయితే బాలాజీ, వెంకటి, తిరుమలేశ్, రాహుల్, శంకర్ మరో వర్గంతో గొడవకు దిగారు. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని దాడి చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీడని హత్య మిస్టరీ..?

- రెండు నెలల క్రితం జరిగినట్లుగా అనుమానం
- ఛత్తీస్‌గఢ్‌లో మర్డర్ కేసు.. హాజీపూర్‌లో అదృశ్యం
- కేసు దర్యాప్తునకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- గుడిపేట వైద్యకళాశాల వెనుక పలు చోట్ల తవ్వకాలు



గుడిపేట శివారులో తవ్వకాలు



దనావుపటేల్‌తో భార్య దులేశ్వరీపటేల్(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వలస కూలీ హత్య కేసు మిస్టరీగా మారింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పోలీసుల బృందం మిస్టరీ ఛేదించే పనిలో నిమగ్నమైంది. హత్యాస్థలంగా భావిస్తున్న ప్రాంతంలో తవ్వకాలు జరిపినా మృతదేహం లభ్యం కాకపోవడంతో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ హత్య కేసు ఇటు హాజీపూర్ పోలీసులు, అటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పోలీసులకు సవాల్‌గా మారింది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఖైరాఘర్ చుయిఖాదాన్ గండై జిల్లాలోని కాటంగి గ్రామానికి చెందిన దనావుపటేల్(38), అతడి భార్య దులేశ్వరీపటేల్ తమ పిల్లలతో కలిసి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట వైద్య కళాశాలలో పని చేసేందుకు కూలీలుగా వచ్చారు. వీరిని అదే రాష్ట్రంలోని రాజానంద్ గ్రామానికి చెందిన దులేశ్ చౌదరీ లేబర్ మేస్త్రీగా పనిలోకి తీసుకొచ్చాడు. వైద్య కళాశాల ఆవరణలోని కార్మికులకు వేసిన షెడ్లలో ఉంటూ రోజూవారీ కూలీకి వెళ్తుండేవారు. ఈ ఏడాది జూన్ 16న మేస్త్రీ దులేశ్‌చౌదరీ, కూలీ దనావుపటేల్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దనావుపటేల్ ఓ పెద్ద సిమెంట్ రాయితో కొట్టడంతో దులేశ్‌చౌదరీకి గాయాలు కాగా అతడు మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆ గొడవలో దనావుపటేల్‌కు కూడా గాయాలైనట్లు తెలిసింది. కాగా, దనావుపటేల్ భార్య దులేశ్వరీపటేల్ తన పిల్లలతో కలిసి ఈ ఘటన జరిగిన రెండ్రోజులకు ఛత్తీస్‌గఢ్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. దనావుపటేల్ రాకపోవడంపై అతడి సోదరుడు సేవారాం పటేల్ ఆమెను ప్రశ్నించగా.. ఎప్పుడో వచ్చాడని చెప్పడంతో కుటుంబంలో అనుమానాలు తలెత్తాయి. సేవారాంపటేల్ ఫిర్యాదు మేరకు ఆగస్టు 3న గండై పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం, అనుమానిత కేసుగా నమోదైంది. విచారణలో దులేశ్‌చౌదరీతో కలిసి తన భర్త దనావుపటేల్‌ను హత్య చేసినట్లుగా దులేశ్వరీపటేల్ అంగీకరించింది. సేవారాంపటేల్ ఫిర్యాదు మేరకు హాజీపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దులేశ్వరీపటేల్, దులేశ్‌చౌదరీలను అనుమానితులుగా పేర్కొన్నారు. అక్కడి పోలీసులు దర్యాప్తులో భాగంగా శుక్రవారం అనుమానితులతో ఇక్కడికి వచ్చారు. హాజీపూర్ పోలీసుల సహకారంతో గుడిపేట వైద్యకళాశాల వెనక వైపు అటవీ శివారు ప్రాంతంలో నిందితులు సూచించిన మూడు ప్రాంతాల్లో జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. ఎక్కడా దనావుపటేల్ మృతదేహం లభించలేదు. మృతదేహాన్ని అక్కడ.. ఇక్కడ పాతిపెట్టామని చెప్పి చివరకు గుర్తు లేదని చెప్పడంతో పోలీసులు కంగుతిన్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది.

గణేశుడి లడ్డూ రూ.1,01,016



వేలంలో లడ్డూను దక్కించుకున్న శేఖర్



వేలంలో లడ్డూ దక్కించుకున్న వెంగళ కుమారస్వామి దంపతులు

కాసిపేట/తాండూర్: కాసిపేట మండలం ముత్యంపల్లిలో శివసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలంలో రూ.1,01,016 ధర పలికింది. అదే గ్రామాని కి చెందిన రైతు పుట్ట మధు దక్కించుకున్నాడు. తాండూర్ మండల కేంద్రంలోని గణేష్ మండలిలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.51,111 ధర పలికింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తాండూరి బాపురావు, రజిత దంపతులు కైవసం చేసుకున్నారు. లక్ష్మీ, గణపతి ప్రతిమలను సూరినేని రవీంద్రరావు, సరోజ, దుగ్యాల హనుమంతరావు, రేఖరాణి దంపతులు సంయుక్తంగా రూ.77,777కు వేలంలో దక్కించుకున్నారు.

శివాలయం లడ్డూ రూ.52016

శ్రీరాంపూర్: నస్పూర్ నాగార్జున కాలనీలోని కాశీవిశ్వేర శివాలయం గణపతి లడ్డూ రూ.52016 ధర పలికింది. నిమజ్జనం సందర్భంగా ఆలయ కమిటీ శుక్రవారం లడ్డూ వేలం వేసింది. కాలనీకి చెందిన కార్మికుడు వెంగళ కుమారస్వామి వేలంలో దక్కించుకున్నాడు. ఏరియాలో అత్యధిక ధర పలికిన లడ్డూ ఇదే కావడం గమనార్హం.

యోగాలో జాతీయస్థాయిలో రాణించాలి



యోగాసన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిర్మల్ టౌన్: యోగా క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి అవార్డులు తీసుకురావాలని తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నందన కృపాకర్ అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న 6వ తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో 24 జిల్లాల నుంచి 521 మంది యోగాసన క్రీడాకారులు ట్రెడిషనల్, బ్యాక్ బెండ్, ఫార్వర్డ్ బెండ్, స్పైన్, రిథమిక్, ఆర్టిస్టిక్‌లతో పాటు వివిధ ఈవెంట్‌లలో ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు విద్యతోపాటు ఉద్యోగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని తెలి పారు. కార్యక్రమంలో నేషనల్ అబ్జర్వర్ దయాని ధి, యోగాసనా స్పోర్ట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రామ్‌రెడ్డి, తోట సతీశ్, నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ జగన్నాథం, డాక్టర్ శ్వేత, పేటా అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి భోజన్న, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, వివిధ జిల్లాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు క్రీడాకారులు పాల్గొన్నారు.

పీవీటీజీల సంక్షేమానికి కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్
- 402 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి: ఆదివాసీ తెగల్లో అన్ని రంగాల్లో వెనుకబడిన పీవీటీజీ కొలాం, తోటిల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కలెక్టర్ రాజర్షిషా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి 402 మందికి పీఎం జన్‌మన్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో కొలాం, తోటి ఆదివాసీలకు ఎలాంటి నిబంధనలు లేకుండా ఇళ్లు మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతీ కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు రేషన్, ఆధార్ కార్డులు అందజేస్తుందని పేర్కొన్నారు. విద్యుత్, డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తుందని, ఉపాధిహామీ కింద సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి కృషి చేస్తుందని చెప్పారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి డబ్బులు లేకుంటే మహిళా సంఘాల ద్వారా బ్యాంక్ రుణాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రుణం ఇవ్వడానికి డీఆర్డీవోతో మండల, బ్యాంక్ అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సావర్‌ఖేడా పాఠశాలను సందర్శిస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- హెచ్‌ఎం రంగయ్య దంపతులకు సన్మానం



రంగయ్య దంపతులను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ప్రత్యేక ఆహ్వానితులుగా సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కడేర్ల రంగయ్య ఆయన సతీమణి వీణను సన్మానించారు. హెచ్‌ఎం రంగయ్యతోపాటు ఉచితంగా బోధన చేస్తున్న ఆయన సతీమణి వీణను అభినందించారు. ప్రమోషన్ వచ్చినా వెళ్లకుండా విద్యార్థుల ఉన్నతికి కృషి చేయడం గొప్ప విషయమన్నారు. గ్రామానికి స్వయంగా వెళ్తానని హామీ ఇచ్చారు. సీఎం చేతుల మీదుగా సన్మానం అందుకోవడం గొప్ప అనుభూతి అని రంగయ్య తెలిపారు.

ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు





ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకుంటున్న నరేందర్‌రావు, అరవింద్‌కుమార్

ఖానాపూర్/మామడ: వినూత్న బోధనతో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బోనగిరి నరేందర్‌రావు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, ఉన్నతవిద్యాశాఖ కమిషన్ శ్రీదేవసేన చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. మామడ మండలం పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైన అరవింద్‌కుమార్ కూడా రాష్ట్ర విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాణా చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. టీచర్లు, వీడీసీ, పోషకుల సహకారంతో అవార్డులు అందుకున్నామని పేర్కొన్నారు.

ఐదుగురు ఆకతాయిలపై కేసు



ఆకతాయిలతో షీ టీం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తున్న ఐదుగురు ఆకతాయిలపై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు షీటీం ఇన్‌చార్జి సుశీల తెలిపారు. గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేట కాలనీలోగల కుమార్ జనతా గణేశ్ మండలి వద్ద వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ వికృత చేష్టలకు పాల్పడిన మయూర్, సిద్ధూ, కార్తిక్, గణేశ్, వినాయక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహిళలు అత్యవసర సమయాల్లో 'డయల్ 100, ఆదిలాబాద్ షీటీమ్ 8712659953 నంబర్లను సంప్రదించాలని సూచించారు. షీటీం బృంద సభ్యులు హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, సిబ్బంది మహేశ్, రోహిణి, లావణ్య తదితరులున్నారు.

ఆర్జీయుకేటీలో మ్యాట్‌ల్యాబ్ బూట్ క్యాంపు



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయుకేటీ) బాసరలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నెక్సస్ క్లబ్ మ్యాట్‌ల్యాబ్ బూట్ శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు మ్యాట్‌ల్యాబ్, మాత్రికా పరికర్మ, భావన, చిత్రీకరణ, కృత్రిమ వాతావరణ కల్పనలపై ప్రాథమిక అవగాహన కల్పించేందుకు ఈ క్యాంపు ఏర్పాటు చేశారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ప్రొఫెసర్లు డాక్టర్ కె.మహేశ్ సమక్షంలో ఈ శిబిరం ప్రారంభమైంది. ఐఐటీ ముంబైలో పీఎంఆర్‌ఎఫ్ ఫెలో అయిన బిశ్వజిత్ సాహూ మ్యాట్ ల్యాబ్ ప్రాథమిక అంశాలు, యంత్రశాస్త్రం, పరిశోధనలో అనువర్తనాలపై అవగాహన కల్పించారు. ప్రయోగాత్మక ప్రదర్శనలు చేశారు. మొదటి రోజు, ఈ2, ఈ3 తరగతుల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని, మ్యాట్ ల్యాబ్ ప్రాథమిక అంశాలు, విద్యుత్, యంత్రశాస్త్రంలో దానిపాత్ర, సమస్య పరిష్కారంలో అనువర్తనాలపై విలువైన అవగాహన పొందారు. మూడు రోజులు క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థి సమన్వయకర్తలు జి.వంశీ, సర్దార్ పుల్లాసింగ్, అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ భుక్యా భావ్సింగ్, ఈఈఈ హెచ్‌వోడీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్ ముత్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ భుక్యా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి



రాణి మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం రాంపూర్‌కు చెందిన చాపిడి రాణి(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలి తల్లి కొత్తపల్లి భాగ్య తెలిపిన వివరాల ప్రకారం.. కైరిగాంకు చెందిన రాణిని నాలుగేళ్ల క్రితం రాంపూర్‌కు చెందిన చాపిడి ప్రశాంత్‌తో వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వారం క్రితం కుమార్తెను కొన్నిరోజులు పుట్టింటికి తీసుకెళ్తానని ఆమె తల్లి కోరగా ప్రశాంత్ నిరాకరించాడు. ఈ నెల 4న కాగజ్‌నగర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి రాణి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిందని ప్రశాంత్ ఆమె తల్లి భాగ్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకుని తాము రాంపూర్‌కు వచ్చేలోగా రాణి మృతదేహాన్ని నేలపై పడుకోబెట్టారని, తన కుమార్తె మరణంపై భర్త ప్రశాంత్‌తోపాటు అత్త చాపిడి కమలపై అనుమానం ఉందని భాగ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వాగులోపడి యువకుడి మృతి



ఈశ్వర్ మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్

సారంగాపూర్: మండలంలోని బండరేవు తండాకు చెందిన కరాడే ఈశ్వర్(22) ప్రమాదవశాత్తు స్వర్ణ వాగులో పడి మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బండరేవు తండాకు చెందిన ఈశ్వర్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని వాగువద్దకు వెళ్లాడు. మైకంలో అదుపుతప్పి వాగులో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఈశ్వర్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈశ్వర్ తండ్రి ఖందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

ఉట్నూర్‌రూరల్: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారి పడ్డ భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఫకీర్ గుట్టకు చెందిన మల్లెల రాములు (45) తాపీమేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం మండల కేంద్రానికి పనికివెళ్లాడు. అక్కడ భవనం గోడపై నిల్చుండి ప్లాస్టరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న మరో గోడపై పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాములు మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బీ.సత్యనారాయణ తెలిపారు. మంచిర్యాల శివారులోని గోదావరి బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఘటన జరిగిందని పేర్కొన్నారు. గుర్తు పట్టలేనంతగా శరీరం నుజ్జునుజ్జు అయిందని, ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు లభించలేదని తెలిపారు. మృతుడి ఒంటిపై నల్ల రంగు ప్యాంటు, నల్లరంగు చొక్కా ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామని, వివరాలకు 9701112343, 9618689879 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవెనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. రణదీవెనగర్‌కు చెందిన తొన్కూర్ విలాస్ (52) వడ్రంగి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి భార్య సవిత, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా, ఇద్దరు కూతుళ్లకు వివాహాలు చేశాడు. 20రోజుల క్రితం పెద్ద కూతురు డెలివరీ కాగా అతడి భార్య సవిత ఆమె వద్దకు వెళ్లింది. దీంతో ఆయన మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో చిన్నారి మృతి



హైందవి(ఫైల్)

వేమనపల్లి: మండల కేంద్రం వేమనపల్లికి చెందిన నాగుల అమరేష్, సోని దంపతుల కూతురు హైందవి(6) గురువారం రాత్రి బ్రెయిన్ ట్యూమర్‌తో మృతిచెందింది. ఆరు నెలలుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. నిరుపేద అమరేష్ గ్రామంలో స్వర్ణకారుడిగా, పంపు మేకానిక్‌గా పని చేస్తున్నాడు. పాప ఆరోగ్యం బాగు కావాలని ఎన్నో ఆస్పత్రులకు తీసుకెళ్లి చికిత్స చేయించాడు. రూ.16 లక్షలు అప్పు చేసి వైద్యం కోసం ఖర్చు చేసినా ఆరోగ్యం మెరుగుపడలేదు. గురువారం రాత్రి ఇంటి వద్దే మృతిచెందింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

జ్వరంతో మహిళ..

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండలం గోయెగాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామానికి చెందిన నాయుడి రాజక్క(45) అనే మహిళ విషజ్వరంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజక్కకు ఐదు రోజుల క్రితం జ్వరం రాగా, మండల ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స అందించారు. అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వరంగల్ తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించగా, ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చి నట్లు లక్ష్మణ్ తెలిపారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పరిస్థితి విషమించి రాజక్క మృతి చెందింది. అయితే రాజక్క డెంగీతోనే మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మెడికల్ కాంపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో: ఒకరి మృతి

మోర్తాడ్(బాల్కొండ): ఓ ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిర్మల్‌కు చెందిన పోగుల సత్యనారాయణ (48) గురువారం రాత్రి ఓ పని నిమిత్తం సమీప బంధువుతో కలిసి ఆటో నడుపుకుంటూ ఏర్గట్ల గ్రామానికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం అర్ధరాత్రి తిరిగి నిర్మల్‌కు బయల్దేరాడు. ఏర్గట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని బట్టాపూర్–తొర్తిల మధ్య ఉన్న రోడ్డుపై ఆటో అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.